సాక్షి తిరుపతి

గురువారం । 13 । జూలై । 2023



నేడే చంద్రయాన్-3 కౌంట్‌డౌన్

సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ఎల్‌వీఎం-3 ఎం-4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 మిషన్ ప్రయోగించనున్నారు. - 8లో



గడప గడపలో ఘన స్వాగతం

పాకాల మండలంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు పాదయాత్రకు బుధవారం ఘన స్వాగతం లభించింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	25
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	35	26

న్యూస్‌రీల్

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి రెండో పర్యాయం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పద్మావతీపురం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 12నుంచి 31వ తేదీలోపు ''ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్'' వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవాలని, అనంతరం సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని వివరించారు. ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన వారికి ఆగస్టు 3, 4వ తేదీల్లో, ప్రైవేటు ఐటీఐల్లో చేరదలచిన వారికి 5 నుంచి 7వ తేదీ వరకు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ఐటీఐలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి హుండీ ద్వారా రూ.1,32,84,088 ఆదాయం వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు వెల్లడించాడు. బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ మేరకు బంగారం 58.500 గ్రాములు, వెండి 434.170 కిలోలు, విదేశీ నగదు 109 నోట్లు వచ్చాయన్నారు. జూన్ 22వ తేదీ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు.

'రాక్‌మెన్'లో ఉద్యోగాలకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : ఏర్పేడు మండలం రాక్‌మెన్ ఇండస్ట్రీలో ఇంజినీరింగ్ టెక్నీషియన్ పోస్టులకు బీటెక్ (సివిల్ తప్ప), డిప్లొమా చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. జాబ్ జాయిన్ అయిన ఏడాది తర్వాత అసిస్టెంట్ ఇంజినీర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తారని వెల్లడించారు. అభ్యర్థులకు ప్రెషర్, సీఎన్‌సీ ఆపరేటింగ్ ,డై కాస్టింగ్ రంగాల్లో 1-4 ఏళ్ల అనుభవం ఉండాలని వివరించారు. ఆసక్తిగలవారు ముందుగా పేర్ల నమోదు, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.ఈ నెల 15వ తేదీన తిరుపతిలోని టీటీడీసీలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం 9160912690, 9963561755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూలోని పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఓ.మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. బుధవారంవ ఆయన మాట్లాడుతూ యూజీసీ-నెట్, సీఎస్ఐఆర్-నెట్ ద్వారా ఫెలోషిప్, జేఈటీఈ (గేట్) ద్వారా స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు ఈ నెల 13 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కళాశాలల్లోని ఖాళీలకు అనుగుణంగా అడ్మిషన్లు చేపట్టనున్నట్లు వివరించారు. డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా ఎలాంటి పరీక్షలు లేకుండానే ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు. వివరాలకు ''డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్వీయూనివర్సిటీ.ఈడీయు.ఇన్/డీఓఏ'' వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

భరతనాట్యం చేస్తూ తిరుమలకు..



నృత్యం చేస్తూ తిరుమలకు వెళుతున్న కళాకారుడు

తిరుమల : భరతనాట్యం చేస్తూ ఓ భక్తుడు కాలినడక మార్గంలో తిరుమలకు చేరుకున్నాడు. నర్సారావుపేటకు చెందిన డాక్టర్ పి.కృష్ణవాసు శ్రీకాంత్ భరతనాట్య కళాకారుడు. ప్రస్తుతం ఆయన పల్నాడులోని శ్రీ వేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠం కోటప్ప కొండ విద్యాలయంలో సంస్కృత అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. శ్రీవారిపై ఉన్న భక్తితో శ్రీవారి మెట్టుమార్గంలో భరతనాట్యం చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారిపై ఉన్న భక్తి ప్రపత్తులను చాటుకోవడంలో భాగంగా అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలకు నృత్యం చేస్తూ మెట్లమార్గంలో తిరుమలకు చేరుకున్నానని తెలిపారు.

పాకాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు, ప్రజాప్రతినిధులు



దొరవారిసత్రంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



చల్లారని జ్వాల

పవన్‌కల్యాణ్ అభ్యంతరకర వ్యాఖ్యలపై జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను దూరం చేయాలనే కుట్రలపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. సమాజానికి తలలో నాలుకగా విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లను అవమానించడంపై వివిధ సంఘాలు మండిపడుతున్నాయి. ఈ క్రమంలోనే సేవా సైనికులు ధర్నాలు.. రాస్తారోకోలు.. ర్యాలీలు.. దిష్టిబొమ్మల దహనాలతో కదం తొక్కారు. చంద్రబాబు అజెండాను అమలు చేస్తూ.. అనుచితంగా మాట్లాడుతున్న జనసేన అధినేత బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దిగజారి వ్యవహరిస్తున్న పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పవన్ అభ్యంతర వ్యాఖ్యలపై ఆందోళనలు
- ప్రజలకు ప్రభుత్వ సేవలను దూరం చేయాలనే కుట్రలు
- పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనాలు
- జనసేనాని బహిరంగ క్షమాపణలు చెప్పాలంటున్న వలంటీర్లు



తిరుపతిలో పవన్, బాబు ఫ్లెక్సీలను దహనం చేస్తున్న వలంటీర్లు, నేతలు

సాక్షి, తిరుపతి : రాష్ట్రంలోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు.. సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన అభ్యంతర వ్యాఖ్యలకు నిరసన జ్వాలలు చల్లారలేదు. సేవే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తుంటే నోటికొచ్చినట్లు మాట్లాడడం ఏంటని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తశుద్ధితో ప్రజలకు సేవలందిస్తుంటే అసత్య ఆరోపణలతో విషం చిమ్మడం దారుణమని మండిపడుతున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టారు.



గాజులమండ్యం వద్ద ర్యాలీ



గూడూరు మున్సిపల్ కార్యాలయం వద్ద..

- తిరుపతి నగరంలో అన్నమయ్య కూడలి వద్ద వలంటీర్లు, స్థానికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను తగులబెట్టారు. పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలిందే అని స్పష్టం చేశారు. లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.
- రేణిగుంట మండలం గాజులమండ్యంలో వలంటీర్లు, స్థానికులు నిరసన ర్యాలీ నిర్వహించి పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- చంద్రగిరి నియోజక వర్గం పాకాలలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజారెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు.
- గూడూరు పట్టణంలో వలంటీర్లు, స్థానికులు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ, ఫ్లెక్సీలను తగులబెట్టారు.
- వాకాడు మండలం జమీన్‌కొత్తపాలెం సచివాలయం వద్ద వలంటీర్లు ర్యాలీ నిర్వహించి పవన్ కల్యాణ్ చిత్రపటాలను దహనం చేశారు. పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాళెం, కల్లూరు, తల్లంపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. పవన్ కల్యాణ్‌పై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రెడ్‌జోన్‌లోకి వెళ్లి..

ఇతని పేరు పి. వెంకటేష్. వరదయ్యపాళెం మండలం రాచర్ల పంచాయతీ మోపూరుపల్లె గ్రామ వలంటీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కోవిడ్ సమయంలో గ్రామాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించారు. ఈ క్రమంలో కోవిడ్ నియంత్రణకు మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ హోమియో మందులు పంపిణీకి ముందుకొచ్చింది. అయితే వాటిని ఇంటింటికీ పంపిణీ చేసే బాధ్యతను వెంకటేష్ తలకెత్తుకున్నాడు. రెడ్‌జోన్‌లోకి ఏమాత్రం భయపడకుండా వెళ్లి గ్రామస్తులందరికీ సకాలంలో మందులు అందించి సేవా దృక్పథం చాటుకున్నాడు. అలాగే ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. విశేష సేవలందించి గ్రామస్తుల అభినందనలు అందుకున్నాడు.

- వరదయ్యపాళెం:



జన్మజన్మలకు మరువలేం



2020 జూలైలో నేను కరోనా బారిన పడ్డా. దీంతో మా కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో మా గ్రామ వలంటీర్ ప్రవల్లిక అండగా నిలబడింది. కోవిడ్ వైరస్ విస్తరిస్తున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో మాకు నిత్యావసర సరుకులను నేరుగా ఇంటికే వచ్చి అందించింది. నిత్యం అవసరమైన మందులను పంపిణీ చేస్తూ ఎనలేని సేవలందించింది. సమీప బంధువుల కూడా చేయలేని విధంగా సాయం చేసింది. మా వలంటీర్‌ను జన్మజన్మలకు మరువలేం.

- కాకాణి ఇందిరమ్మ, సైదాపురం

మహిమాన్వితం.. మెట్లోత్సవం



మెట్ల పూజ చేస్తున్న శ్రీనివాసులు, ఆనందతీర్థాచార్యులు



భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం ఎందరో మహనీయులు నడచివెళ్లిన మెట్ల మార్గం మహిమాన్వితమైందని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద వేడుకగా శ్రీవారి మెట్లోత్సవం నిర్వహించారు. ముందుగా దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, శ్రీనివాసులు కలిసి మెట్ల పూజ ప్రారంభించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పూర్వం పురంధరదాసు, శ్రీవ్యాసరాజయతీశ్వరులు, అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు వంటి మహనీయులు భక్తి ప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారన్నారు. వారి అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే తలంపుతో టీటీడీ మెట్లోత్సవాన్ని జరిపిస్తోందని వివరించారు. ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భజన మండళ్ల సభ్యులు సాంప్రదాయ భజనలు చేసుకుంటూ సప్తగిరులను అధిరోహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన 3,500 మందికి పైగా భజన మండళ్ల సభ్యులు అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్దకు చేరుకున్నారు. అనంతరం పాదాల మండపం వద్ద సంప్రదాయబద్ధంగా మెట్ల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణలతో అలిపిరి పులకరించింది.

ఆఖరి మజిలీకి అన్నీ తామై..!

- కోవిడ్ మృతులకు అంత్యక్రియలు జరిపించిన వలంటీర్లు
- అందరూ భయపడుతున్న తరుణంలో మేమున్నామంటూ సేవలు

రెండేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న వేళ.. వైరస్ బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఎక్కడ చూసినా రెడ్‌జోన్లు.. నిర్మానుష్యంగా వీధులు.. ఇంట్లో నుంచి బయటకు కదలే పరిస్థితి లేదు.. ఎవరినైనా తాకాలంటే భయం.. ఇక కరోనా బారిన పడి మరణించినవారికి అంత్యక్రియలకు కూడా ఎవరూ ముందుకురాని దుస్థితి. మృతుల కుటుంబీకులు సాయం కోసం పిలిస్తే సొంత బంధువులు కూడా ముఖం చాటేసే రోజులు. ఆ సమయంలో వలంటీర్లు మొక్కవోని ధైర్యంతో విశేష సేవలందించారు. మృతదేహాలను దగ్గరుండి ఆఖరి మజిలీకి చేర్చారు. అన్నీతామై ఆత్మబంధువులుగా నిలిచారు.

- పలమనేరు



వృద్ధురాలిని శ్మశానానికి తీసుకెళ్ళే కార్యక్రమాన్ని చేస్తున్న వలంటీర్(ఫైల్)

కోవిడ్ సెకెండ్ వేవ్.. మే 2021 లాక్‌డౌన్ అమల్లో ఉంది. పలమనేరు పట్టణంలోని ఆది ఆంధ్రవీధికి చెందిన జమున(50) అనే మహిళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు ఓ కుమార్తె మినహా ఇంకెవరూ లేరు. ఓ రోజు హఠాత్తుగా జమున తన ఇంట్లోనే మరణించింది. కుమార్తె తన తల్లి అంత్యక్రియలకు సహకరించమని బంధులను ప్రాధేయపడింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో తల్లడిల్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రంగాపురం వార్డు సచివాలయ వలంటీర్ మైఖేల్ సురేష్ వెంటనే స్పందించాడు. స్థానిక గాంధీనగర్ శ్మశానవాటికకు చెందిన కొందరిని తీసుకువచ్చాడు. మృతురాలి బంధువుల్లో ఇద్దరితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి ఒప్పించాడు. జమునకు సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నాడు. అందరితోనూ శభాష్ అనిపించుకున్నాడు.


జేసీబీలు రాని సమయంలో..



సంబార్‌పూర్‌లో జేసీబీతో గుంత తవ్విస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది(ఫైల్)

పలమనేరు సమీపంలోని సాయినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత బద్రి కోవిడ్ కారణంగా 2021 మేలో మృతి చెందాడు. అతడి స్వగ్రామం కొలమాసనపల్లెలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులు సన్నద్ధమయ్యారు. అయితే భౌతిక కాయాన్ని ఖననం చేసేందుకు అవసరమైన గుంత తవ్వేందుకు జేసీబీ దొరకలేదు. అడిగినంతా ఇస్తామని నచ్చజెప్పినా జేసీబీ నిర్వాహకులు ముందుకు రాలేదు. ఇదే పరిస్థితి సంబార్‌పూర్‌లో ఓ వ్యక్తి కోవిడ్‌తో మృతి చెందితే తలెత్తింది. బ్యాంకర్స్ కాలనీలోనూ ఓ మహిళ మృతి చెందితే ఖననం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో వలంటీర్లే సేవలందించారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మృతులను ఆఖరి మజిలీలకు చేర్చారు.


ఎన్నటికీ మరువలేం



మా ఇంటి పక్కనే ఉన్న జమునమ్మ మృతి చెందింది. ఆమెకు ఓ కుమార్తె మాత్రమే ఉంది. జమునమ్మకు అంత్యక్రియలను నిర్వహించేందకు ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి సమయంలో మా వార్డు వలంటీర్ మైఖేల్ అన్నీ తానై వ్యవహరించాడు. సొంత మనుషులు పట్టించుకోకున్నా దగ్గరుండి అంత్యక్రియలు జరిపించాడు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో మైఖేల్ అందించిన సేవలను ఎన్నటికీ మరువలేం.

- ప్రవల్లిక, ఆదిఆంధ్ర వీధి, పలమనేరు

కుటుంబీకులుగానే భావిస్తా



నా వార్డు పరిధిలోని 50 కుటుంబాలను నా సొంత కుటుంబీకులుగా భావిస్తా. సేవచేయాలనే ఆలోచనతోనే వలంటీర్‌గా చేరా. డబ్బు సంపాదన కోసం ఇందులోకి రాలేదు. కోవిడ్ సమయంలో మృతదేహాలకు అంత్యక్రియలు చేయలేదంటే తట్టుకోలేక పోయేవాడిని. అందుకే నేనే ప్రత్యేక చొరవ తీసుకుని సేవలందించా. నాకు తృప్తి చాలు.

- మైఖేల్ సురేష్, వలంటీర్, పలమనేరు

కేంద్రమంత్రి గడ్గరీకి సాదర స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఎంపీ గురుమూర్తి



సత్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట : కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీకి బుధవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం సాయంత్రం 4.55 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ బాలాజీ, నగర పాలక కమిషనర్ హరిత, ఆర్డీఓ రామారావు, ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఓ రాకేష్‌కుమార్ సింగ్ తదితరులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

15న తిరుపతిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : నగరంలోని అలిపిరి రోడ్డు సమీపంలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వద్ద ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణులైనవారు హాజరుకావచ్చని తెలిపారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు


లాడ్జీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి క్రైం: భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు మంగళవారం అర్ధ రాత్రి జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లాడ్జీలు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, విశ్రాంతి భవనాలు, టీటీడీ అతిథి గృహాల వద్ద తనిఖీలు చేసి, అనుమానిత వ్యక్తులను విచారించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఏదైనా అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే లాడ్జీలు, హోటల్ యజమానులే బాధ్యత వహించాలన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు.

మామిడి వ్యాపారులకు రూ.51 లక్షల టోకరా

చిత్తూరు అర్బన్: కట్టమంచిలోని వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో మామిడి వ్యాపారం చేస్తున్న పది మంది వ్యాపారులకు శ్రీనగర్‌కు చెందిన ముగ్గురు కుచ్చుటోపీ పెట్టారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. కట్టమంచిలోని మామిడికాయల మార్కెట్‌లో నందగోపాల్‌నాయుడు మరో పది మంది వ్యాపారుల నుంచి కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌కు చెందిన ఖుర్షిద్ అహ్మద్, నజీర్ అహ్మద్, హమీద్ అనే ముగ్గురు ట్రేడర్లు గత రెండు నెలలుగా మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన సరుకుకు కొంత మేరకు నగదు చెల్లించి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో 42 లారీల మామిడి కాయలను తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించి రూ.51 లక్షలను చెల్లించలేదు. వ్యాపారులు అడిగితే, ఇప్పుడే చెల్లిస్తానంటూ చెబుతూ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

నేడే చంద్రయాన్-3 కౌంట్‌డౌన్

- రేపు మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగం
- అధికారికంగా ప్రకటించిన ఇస్రో శాస్త్రవేత్తలు
- నింగికెగసేందుకు సిద్ధంగా ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) కేంద్రంలోని రెండో ప్రయోగవేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 నింగికి చేరనుంది. బుధవారం ఈ మేరకు ఎంఆర్ఆర్ కమిటీ, ల్యాబ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది.


ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో మిషన్ సంసిద్ధతా సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం 2.35 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు నిర్ణయించారు.

ప్రయోగక్రమం ఇలా..

- ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 43.43 పొడవు, 640 టన్నులు బరువుతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి నింగికి పయనమవుతుంది.
- ఇందులో 3.920 కిలోల బరువుగల చంద్రయాన్-3 మిషన్ పంపుతారు.
- చంద్రయాన్-3 ఉపగ్రహంలో 2,145 కిలోల ప్రపొల్షన్ మాడ్యూల్, 1749 కిలోల ల్యాండర్, 26 కిలోల రోవర్‌ను చంద్రుడిపై పరిశోధనలకు పంపిస్తున్నారు. ఇందులో ఆరు ఇండియన్ పేలోడ్స్‌తో పాటు అమెరికాలోని నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపుతున్నారు.


షార్‌లోని రెండో ప్రయోగవేదికపై ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక

- ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్-200 బూస్టర్ల సాయంతో నింగి ఎగురుతుంది. ఈ దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 127 సెకండ్లలో మొదటి దశను పూర్తి చేస్తారు.
- రెండో దశలో ఎల్-110 అంటే ద్రవ ఇంజిన్ మోటార్లు 108.10 సెకండ్లకే స్టార్ట్ అవుతాయి. రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 305.56 సెకండ్లకు రెండోదశను పూర్తి చేస్తారు.
- ఈ మధ్యలో 194.96 సెకండ్లకు రాకెట్ శిఖరాన అమర్చిన చంద్రయాన్-3 మిషన్‌కు ఏర్పాటు చేసిన హీట్‌షీల్డ్స్ విడిపోతాయి.
- మూడోదశలో అత్యంత కీలకమైన క్రయోజనిక్ (సీ-25) మోటార్లు 307.96 సెకండ్లకు స్టార్ట్ అవుతాయి. 958.71 సెకండ్లకు మూడోదశలో 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి మూడోదశను 954.42 సెకండ్లకు కటాఫ్ చేస్తారు.
- క్రయోజనిక్ దశతోనే రాకెట్‌కు శిఖర భాగాన అమర్చిన త్రీ-ఇన్-ఒన్ మిషన్ అయిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని 969.42 సెకండ్లకు (16.15 నిమిషాల వ్యవధిలో) భూమికి దగ్గరగా (పెరిజీ)170.06 కిలోమీటర్లు, భూమికి దూరంగా (అపోజీ) 36,500 కిలోమీటర్లు ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ అర్బిట్(అత్యంత విపరీతమైన కక్ష్య)లోకి ప్రవేశపెడతారు.
- అనంతరం బెంగళూరులోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు ఆధీనంలోకి తీసుకుని, చంద్రుడిపైకి వెళ్లేంత వరకు ఆపరేషన్ చేపడతారు.
- మొత్తంగా 3.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించి చంద్రయాన్-3 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరుకుంటుంది.


చంద్రయాన్-3 మిషన్ లో భాగంగా ప్రపొల్షన్ మాడ్యూల్‌కు అనుసంధానించిన ల్యాండర్, రోవర్

- ప్రపొల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి ఉపరితలంపై అంటే చంద్రుడికి రెండోవైపు దక్షిణ ధ్రువ ప్రాంతంలో నెమ్మదిగా దిగుతుంది.
- ప్రయోగం జరిగిన 41 రోజుల తర్వాత ఆగస్టు 23వ తేదీ సాయంత్రం 6.24 గంటలకు చంద్రయాన్-3లో ఒక భాగమైన ల్యాండర్ చంద్రుడి మీదకు చేరుకుంటుంది.
- ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై దిగిన 4 గంటల తర్వాత రోవర్ బయటకు వస్తుంది.
- రోవర్ సెకండ్‌కు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. ఒక లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు అవుతుంది.
- ఈ 14 రోజుల్లో 500 మీటర్లు ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై మూలాలను పరిశోధించి కంట్రోల్ సెంటర్‌కు సమాచారం చేరవేస్తుంది.


లూనార్ ఆర్బిట్‌లో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్‌ను విడిచిపెడుతున్న దశ్యం (ఊహా చిత్రం)


చంద్రుడిపై ఉపరితలంపై దిగేందుకు ల్యాండర్‌ను మండిస్తున్న దశ్యం (ఊహా చిత్రం)


ల్యాండర్‌లో నుంచి బయటకు వస్తున్న రోవర్ (ఊహా చిత్రం)

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,271 మంది స్వామివారిని దర్శించుకోగా, 28,652 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

● జగన్ లాంటి నేతను చూడలా..!



ఎందరో నాయకులు వస్తుంటారు.. కొందరే ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటారు. పరిపాలనలో తమదైన ముద్ర వేస్తుంటారు.. ఆత్మీయతను పంచి ప్రజల అభిమానం చూరగొంటారు.. పేదల కన్నీరు తుడిచేందుకు పరితపిస్తుంటారు.. ఆడపడుచుల అభ్యున్నతికి ఆసరాగా నిలుస్తుంటారు. జనంలోకి వెళ్లినప్పుడు ఎక్కడో ఒకచోట అనూహ్య స్పందన వస్తుంది. సంక్షేమ ఫలాలు పొందినవారి ఆనందం తెలుస్తుంది. పాలకుడిపై సంతృప్తి స్థాయి వెల్లడవుతుంది. అలాంటి దృశ్యమే బుధవారం తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆవిష్కృతమైంది. ఇంటింటికీ వెళుతున్న ఎమ్మెల్యే భూమన 6వ డివిజన్‌లోని సుభాష్‌నగర్‌లో వరదప్పనాయుడు అనే వృద్ధుడిని పలకరించారు. యోగక్షేమాలు విచారించారు. పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా.. అని ఆరా తీశారు. దీనికి సదరు వృద్ధుడు స్పందిస్తూ తనకు 93 ఏళ్లని.. ఇంత అనుభవంలో ఇంతటి నేతను చూడలేదని స్పష్టం చేశారు. ఈ స్థాయిలో ప్రజల సంక్షేమం కోసం పాటుపడే నాయకుడు ఎవరూ లేరని ప్రశంసించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అద్భుతంగా ఉందని వివరించారు. వృద్ధుడి మాటలకు ఎమ్మెల్యే భూమన మురిసిపోయారు. ప్రజలకు చిత్తశుద్ధితో మేలు చేస్తే ప్రతిస్పందన ఇలానే ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. – తిరుపతి మంగళం

17 నుంచి అంతరిక్ష వారోత్సవాలు

తిరుపతి కల్చరల్: చంద్రునిపై మానవుడు దిగిన సందర్భాన్ని పురస్కరించుకుని సైన్స్ సెంటర్‌లో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో తెలిపారు. రీజినల్ సైన్స్ సెంటర్, నేషనల్ అట్మాస్పియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ గాదంకి వారి సహకారంతో నిర్వహించనున్న ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు, సాధారణ సందర్శకులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చంద్రునిపై ల్యాండింగ్, ఉత్సుకత, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై పోటీలు నిర్వహించనున్నామన్నారు. 18న అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఓపెన్ హౌస్ సైన్స్ క్విజ్ పోటీలు, 19న ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు మిషన్ చంద్రయాన్ గతం, వర్తమానం, భవిష్యత్తు అంశంపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 20న అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఇంటర్ స్కూల్ టీమ్స్‌కు సైన్స్ క్విజ్ పోటీ, 21న రాకెట్, శాటిలైట్ మోడల్ పోటీ, 22న రోవర్ మోడల్ తయారీపై వర్క్‌షాప్, 23న ఉదయం 10.30 గంటలకు చంద్రయాన్ 3 ప్రయాణం పోటీ ఉంటుందని తెలిపారు. ఇదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధికి చిరునామా.. చంద్రగిరి

- ప్రతి పంచాయతీకి రూ.కోటికి పైగా నిధులు
- జగనన్న సురక్షతో ప్రజల వద్దకే పాలన
- జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీర్చిదిద్దారని జాయింట్ కలెక్టర్ బాలాజీ కొనియాడారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం యోగిమల్లవరం, గొల్లపల్లె పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వినూత్నంగా ఆలోచిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రజలకు ఏదైనా పని కావాలంటే కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్ ప్రతి ఇంటికీ వచ్చి వారికి కావాల్సిన అన్ని సర్టిఫికెట్లు మంజూరు చేయిస్తున్నారని వెల్లడించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు 881 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.


సి.గొల్లపల్లెలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ప్రజలకు ఆర్థిక భరోసా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి లబ్ధిదారుడికి నేరుగా సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నరని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మెరుగైన విద్య, వైద్యం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని వెల్లడించారు. వివిధ పథకాల అమలుతో బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారని తెలిపారు. ప్రజా సంక్షేమ కోసం నిరంతరంగా శ్రమిస్తున్న జగనన్న పాలనలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భావి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం పరితపిస్తున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించండి


మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లాలో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. హత్య కేసులు, అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్, పోక్సో యాక్ట్ వంటి గ్రేవ్ కేసులన్నీ తప్పనిసరిగా నేర నిరూపణ అయ్యేవరకు ఫాలోఅప్ చేయాలన్నారు. నేరస్తులు ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కోర్టు ఉన్న కేసులపై డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంచి, పురోగతి సాధించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు కోర్టుకు హాజరై వారి పరిధిలోని కేసులను నేర నిరూపణ అయ్యే వరకు తప్పనిసరిగా బాధ్యతగా పనిచేయాలన్నారు. దీర్ఘకాలంలో పెండింగ్ కేసుల కోసం నిరంతరం శ్రమించి త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ వెంకటరావు డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి


గోవిందయ్య మృతదేహం

నారాయణవనం: మండలంలోని కృష్ణమరాజులకండ్రిగ క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవిందయ్య(35) అనే కూలీ మృతి చెందాడు. వివరాలు.. పిచ్చాటూరు మండలం కొత్త శివగిరి టీచర్స్ కాలనీకి చెందిన గోవిందయ్య కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పుత్తూరు నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా చెన్నై నుంచి కలికిరికి వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో గోవిందయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ వెల్లడించారు. తమిళనాడుకు చెందిన డ్రైవర్ రాజపాండిని అదుపులోకి తీసుకుని, లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గడపగడపలో ఘన స్వాగతం

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పొలిసేనివారిపల్లె, అడుసుపల్లెలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మహా పాద యాత్రలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి యువత బైక్ ర్యాలీతో ఆహ్వానం పలికారు. అనంతరం మోహిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పొలిసేనివారిపల్లిలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, అలాగే ధ్యాన మందిరం, ఆర్‌ఓ ప్లాంట్, జగనన్న సమావేశ మందిరం, శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అభివృద్ధి పనులకు రూ.25 లక్షల ఖర్చు చేశామన్నారు. అలాగే అడుసుపల్లె గ్రామంలో రూ.15 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజాబాబురెడ్డి, నంగా బాబురెడ్డి, నేంద్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరి సురేష్, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ సభ్యులు కస్తూరి, మోహన్, డాక్టర్ శివప్రసాద్, ఉమాపతి, అంజి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గుడిలో చోరీ

తిరుపతి రూరల్ : మండలంలోని చెర్లోపల్లెలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ కిటికీ ఊచలు తొలగించి ప్రవేశించిన దుండగులు లోపల ఉన్న రెండు బీరువాలను ధ్వంసం చేశారు. అనంతరం రెండు హుండీలను పగులగొట్టి దాదాపు రూ.50 వేలనగదు, వెండి వస్తువులను అపహరించారు. ఈ క్రమంలో ఆలయంలోని సీసీ కెమెరాలను సైతం దుండగులను పనిచేయకుండా చేసి, హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లారు. ఈఓ రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని గొర్రెలదొడ్డి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 50 టెట్రా ప్యాకెట్లును, బైక్‌ను సీజ్ చేసినట్టు డీటీఎఫ్ చిత్తూరు టీమ్ సీఐ మాధవస్వామి బుధవారం తెలిపారు.